క్లుప్తంగా

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



నగరంపాలెం: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు గేరా మోహనరావు, డి.పెదబాబు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారిణి పి.శైలజకు బుధవారం వినతిపత్రం అందించారు. జిల్లా శాఖ తరపున బదిలీలకు సంబంధించి జీవోలోని అసంబద్ధతలు, సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రాధాన్యతా క్రమంలో అర్హులకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్ర నరసింహారావు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వాసిమల్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



నగరంపాలెం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లపై అధ్యాపకులు మణి అవగాహన కల్పించారు. పిల్లల మానసిక వికాసానికి కథలు చెప్పి, పాటలు పాడించారు. వచ్చే నెల 11 వరకు శిబిరాన్ని నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

తెనాలి: కేబీఎస్ అండ్ కేవైఆర్ క్రికెట్ టోర్నమెంటు ఈ నెల 26 నుంచి స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీలో నిర్వహించనున్నట్టు కావేటి వేణుగోపాల్ బుధవారం తెలిపారు. వేసవిలో క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో కావేటి యలమందరావు స్మారక రాష్ట్ర, జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటు జూన్ 5వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ పోటీలను ప్రారంభిస్తారని వెల్లడించారు. వీరితో అచ్యుత వేణు, పాశం వెంకటేష్, కావేటి కిరణ్, మద్దినేని కిరణ్, కొరివి సతీష్ ఉన్నారు.

రేపటి నుంచి 'ఈ తరంలో మేము ప్రత్యేకం' శిక్షణ శిబిరం

తెనాలి: స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం, తెనాలి ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి జూన్ 5వ తేదీ వరకు 'ఈ తరంలో మేము ప్రత్యేకం' పేరుతో వేసవి శిబిరం నిర్వహించనున్నారు. గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయం హాలులో ప్రతిరోజు ఉదయం 7–9 గంటల మధ్య తరగతులు ఉంటాయని అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా ఫోక్, వెస్ట్రన్, బాంగ్రా నృత్యాలు, మోటివేషన్ తరగతిలో హెల్త్ ట్రెనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌ను నేర్పిస్తారు. విద్యార్థుల్లో ప్రధాన లోపాలైన జంక్ ఫుడ్ తినడాన్ని మాన్పించటం, సెల్‌ఫోన్, వీడియోగేమ్స్‌కు అలవాటు పడిన విద్యార్థులకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్, బద్ధకాన్ని, నిర్లక్ష్యాన్ని నిర్మూలించి, నేర్చుకోవటంపై ఆసక్తిని పెంపొందించటం వంటి ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.

మద్యపాన నిషేధానికి సైకిల్ యాత్ర



తెనాలి టౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి తెనాలి శాఖ వ్యవస్థాపకుడు కిశోర్ గురూజీ ఆధ్వర్యంలో మద్యపాన నిషేధం కోరుతూ బుధవారం పట్టణంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. గంగానమ్మపేట చండూరు వారి సత్రం నుంచి బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పీజీ కళాశాల వరకు నిర్వహించిన యాత్రలో యోగ మండలి సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో 'మద్యపానం–సమాజంపై దుష్ప్రభావం' అన్న అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఐనంపూడి శరత్ బాబు, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నరేష్, గుప్తా కళాశాల అధ్యాపకులు ఎం. దశరథరామిరెడ్డి, డి. శ్రీనివాసరావు మాట్లాడారు. యోగ సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, ఎ. శ్రీనివాసరెడ్డి, గొడవర్తి సత్యనారాయణ, సుబ్బారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో సకల సౌకర్యాలు

మేయర్ కావటి



శ్రీనివాసరావుపేటలోని శ్మశానవాటిక అభివృద్ధి గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుంటున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలోని శ్మశానవాటికల్లో ఆహ్లాదకరమైన వాతావరణానికి గ్రీనరీతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. ఆయన బుధవారం శ్రీనివాసరావుపేటలోని హిందూ శ్మశానవాటికలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను ఎనిమిది డివిజన్లలోని ప్రజలు వినియోగిస్తున్న దృష్ట్యా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పెదకర్మ, ఇతర కార్యక్రమాలు నిర్వహించే నిమిత్తం, కొన్ని రోజుల పాటు అక్కడే ఉండేందుకు గదులు, భోజనశాల, వంటశాల, కేశఖండనం, సాన్నపు గదులు, అస్థికలు భద్రపరుచు గదులతో పాటు వాటిక బయట రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. దహనానికి కట్టెలు, ఎలక్ట్రికల్ దహన యంత్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పార్థివ దేహాల్ని భద్రపరచడానికి ప్రత్యేకంగా ఐస్ మార్చురీ గదులు, ఇతర బాక్సులు, పలు దేవత మూర్తుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నగరంలోని శ్మశానాల్ని అభివృద్ధి చేయడానికి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ సహకారాలు కూడా తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కాంద్రకుంట గురవయ్య, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్‌బాబు, ఏఈలు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

పైపులైన్ మరమ్మతుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీపురం హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌కు సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద లీకు పడింది. ఈ సందర్భంగా చేస్తున్న మరమ్మతుల్ని బుధవారం మేయర్‌తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పనుల్ని బుధవారం సాయంత్రానికి పూర్తి చేసి తాగునీటిని యథావిధిగా పునరుద్ధరించాలని తెలిపారు. ఎమినిటీ కార్యదర్శులు కూడా తమ పరిధిలో పైపులైన్లకు లీకులు పడితే వెంటనే వాటిని ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ధూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, కో- ఆప్షన్ సభ్యులు పూనూరి నాగేశ్వరరావు, అగ్గిపెట్టి రాజు, అయిశెట్టి శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కరరావు, ఈఈలు కోటేశ్వరరావు, కొండా రెడ్డి, సుందర్రామిరెడ్డి, డీఈఈ కల్యాణ్‌రావు, ఏఈ అనూష, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపుతోనే ఉత్తమ ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: విద్యతోపాటు నైపుణ్య లక్షణాలు పెంపొందించుకుంటేనే ఉత్తమ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ విభాగంలో పీవీఎస్ గ్రూప్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ హెల్త్‌కేర్ సంస్థ నిర్వహించిన వాక్‌ఇన్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి బుధవారం వీసీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. జువాలజీ విభాగాధిపతి ఆచార్య కె. సునీత మాట్లాడుతూ జువాలజీ, ఆక్వా కల్చర్ విభాగాల నుంచి పదకొండు మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.కార్యక్రమంలో పీవీఎస్ గ్రూప్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ లేబొరేటరీస్ రీసెర్చ్ డెవలప్‌మెంటు డైరెక్టర్ బి. రాజేష్, హెచ్ఆర్ విభాగ ప్రతినిధి ఈ. రమేష్, ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, యూనివర్సిటీ పీజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య ఎల్. ఉదయకుమార్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూతో పీబీసీ ఏరో హబ్, ఐటిటెక్ సంస్థల ఎంఓయూ

పూనే ప్రధాన కేంద్రంగా ఉన్న పీబీసీ ఏరో హబ్, న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న ఐటిటెక్ సంస్థలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీతో ఎంఓయూ(అవగాహనా ఒప్పందం) కుదుర్చుకున్నాయి. ఏఎన్‌యూలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, పీబీసీ ఏరోహబ్, ఐటిటెక్ సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూలో భాగంగా పీబీసీ ఏరోహబ్, ఐటిటెక్ సంస్థలు సంయుక్తంగా ఏఎన్‌యూలో డ్రోన్ ఎక్స్‌లెన్సీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నాయని తెలిపారు. ఈ సెంటర్ ద్వారా ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఆసక్తి ఉన్న రైతులకు వ్యవసాయ అనుబంధ అంశాల్లో డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, పీబీసీ ఏరోహబ్, ఐటిటెక్ సంస్థల డైరెక్టర్లు ప్రసాద్, భరద్వాజ, రత్నాకర్ పాల్గొన్నారు.

సెన్స్ సెమీ కండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్‌తో వీవీఐటీ ఒప్పందం



ఒప్పందం పత్రం అందుకుంటున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: విద్యార్థుల్లో అధునాతన సాంకేతిక అంశాలైన ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ, ఐటీ నైపుణ్యాల్ని పెంపొందించేందుకు సెన్స్ సెమీ కండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (వీవీఐటీ) చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరులోని కళాశాలలో బుధవారం అవగాహనా ఒప్పందం సందర్భంగా ఆయన మాట్లాడారు. బెంగుళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే సెన్స్ సెమీ కండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్‌తో ఒప్పందం ద్వారా విద్యార్థులు భారీ వేతనాలతో నియామకాలు పొందేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కళాశాలలోని ఉపాధికల్పనా శిక్షణ విభాగంతోకలసి పరిశ్రమ అవసరాలకు తగ్గట్లుగా విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, సీఐసీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ఆర్.ఎస్. ఠాగూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పథకాల విజయవంతంలో వలంటీర్ల పాత్ర కీలకం



వెనిగండ్లలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు

పెదకాకాని: ప్రభుత్వ పథకాలు విజయవంతంగా ప్రజలకు చేర్చడంలో వలంటీర్ల పాత్ర కీలకమని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలో బుధవారం సచివాలయాల వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. వెనిగండ్ల సచివాలయం-1, సచివాలయం- 2 పరిధిలో 38 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వారిలో ఇద్దరికి సేవావజ్ర, ఒకరికి సేవారత్న పురస్కారాలు వరించాయి. 35 మందికి సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. నియోజక వర్గస్థాయిలో ఐదుగురికి ఎంపిక చేసి సేవావజ్ర పురస్కారాలు అందజేస్తున్నారు. ఒక్క వెనిగండ్లలోనే వేల్పుల కోటేశ్వరరావు, కోవెలమూడి శ్రావణి సేవా వజ్ర పురస్కారాలు అందుకున్నారు. బుల్లా కిరణ్‌కుమారికి సేవారత్న పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని విజయవంతం చేయడంలో వలంటీర్ల పాత్ర అభినందనీయమన్నారు. ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య వారధులు, సంక్షేమ సారథులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని కొనియాడారు. క్రమశిక్షణ, నిజాయితీగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలని సూచించారు. గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ రామాంజనేయులు, పంచాయితీ కార్యదర్శి ఈమని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మహిళపై దాడి

మహిళపై అత్త, ఆడపడుచు కలసి దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అత్తింటి వేధింపులు భరించలేక రమాదేవి మారుతీనగర్‌లోని సోదరి ఇంటికి వెళ్లింది. అక్కడకు బుధవారం అత్త మీరమ్మ, ఆడపడుచు అన్నామణి వెళ్లి దుర్భాషలాడి దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై కేసు నమోదు

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం ప్రాంతానికి చెందిన సేవకుమార్ భార్య కామేశ్వరిదేవిని అదనపు కట్నం తెమ్మని వేధింపులకు గురిచేస్తున్నాడు. తరచూ కొట్టి దుర్భాషలాడుతున్నాడు. అదనపు కట్నం తేకపోతే చంపుతానని బెదిరించాడు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండిళ్లలో చోరీ

రెండిళ్లలో చోరీలపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో నివసించే మర్రిబోయిన నాగరాజు ఇంటి తలుపులు తీసి బయటకు వెళ్లారు. భార్య బాత్‌రూంకు వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి టేబుల్‌పై ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ. 18వేలు ఎత్తుకుపోయాడు. ఆలస్యంగా గుర్తించిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- నవభారత్‌నగర్ 4వ లైనులో నివసించే బత్తుల గోపిరెడ్డి బుధవారం మధ్యాహ్నం మోటారు స్విచ్ ఆఫ్ చేసేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చి సందులోకి వెళ్లారు. స్విచ్ ఆఫ్ చేసి తిరిగి చూడగా ఓ వ్యక్తి ఇంట్లోంచి బయటకు పరుగులు తీస్తున్నాడు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని వంద గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 14వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు గోపిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓబీసీ స్థితిగతులపై కంటితుడుపుగా కమిషన్స్ ఏర్పాటు

నెహ్రూనగర్: ఓబీసీ స్థితిగతులపై కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిషన్స్ సిఫార్సులు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరావు డిమాండ్ చేశారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓబీసీ స్థితిగతుల మార్పేందుకు కేంద్రం కేవలం కంటితుడుపు చర్యగా కమిషన్స్ వేస్తుందే తప్పా వాటి అమలుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఓబీసీ కులగణనతో పాటు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, కేంద్ర సర్వీసుల్లో 27శాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, ఉప్పులూరి పేరయ్య, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సంక్షేమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

పాత గుంటూరు: కొత్తగా ఏర్పాటు అయిన జిల్లాల్లో వెంటనే దివ్యాంగుల సంక్షేమ కార్యాలయాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ కోరారు. కలెక్టరేట్ వద్ద బుధవారం దివ్యాంగుల సమస్యలపై నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దంపతులు ఇద్దరు దివ్యాంగులు అయితే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. వారికి తొలగించిన పింఛన్లు ఎలాంటి షరతులు లేకుండా మంజూరు చేయాలని, ప్రతి కుటుంబానికీ 35 కిలోల అంత్యోదయ కార్డులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆనం చిన సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు జి.కిరణ్, జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదకాకాని: లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు రైస్ ట్రీ పార్క్, డాంగే నగర్, నంబూరు, కొప్పురావూరు గ్రామ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డీఈఈ పీహెచ్. ఖాన్, ఏఈ బి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

షుగర్ అదుపులో లేకపోతే అవయవాలకు నష్టం



సీఎంఈలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కుమార్

గుంటూరు మెడికల్: షుగర్ వ్యాధిని నియంత్రణలో పెట్టుకోకపోతే శరీరంలో పలు అవయవాలు పాడైపోతాయని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు ఆధ్వర్యంలో బుధవారం డయాబెటిస్‌పై వైద్యులకు నిరంతర వైద్య విద్య (సీఎంఈ) నిర్వహించారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి చికిత్సలో ఆహార నియమాలు, వ్యాయామం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. మందుల్లో నేడు అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ఒకప్పుడు కంట్రోల్ కోసమే ఉండేవని, నేడు షుగర్ వల్ల వచ్చే కిడ్నీ, గుండె జబ్బుల్ని నివారించే మందులు సైతం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. బాధితులు షుగర్, బీపీ, కొలెస్ట్రాల్‌ను అదుపులో పెట్టుకుని, వైద్యుల సహాలతో మందులు వాడడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. వ్యాధి నియంత్రణకు మందులు ఏ విధంగా వాడాలో వివరించారు. విజయవాడకు చెందిన డాక్టర్ నారాయణ షుగర్ వ్యాధి చికిత్సలో ఇన్సులిన్ పాత్ర గురించి వివరించారు. మాత్రలు వాడుతున్నప్పటికీ వ్యాధి అదుపులోకి రాకపోతే ఇన్సులిన్ వాడాలని, అశ్రద్ధ చేయడం వల్ల అనేక నష్టాలు సంభవిస్తాయని వెల్లడించారు. డాక్టర్ సలహా మేరకు అవసరమైతే ఇన్సులిన్ వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జి. బాబూరావు, డాక్టర్ వై.వి.ఎస్.ప్రభాకర్, డాక్టర్ నారాయణ, ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ తాతా సేవకుమార్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికుల్ని ఏర్పాటు చేసుకోవాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఆమె బుధవారం అదనపు కమిషనర్ నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్టుమెంటు అధికారులు, ఎమినిటీ కార్యదర్శులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ తొలుత లే అవుట్స్ వారీగా పూర్తయిన ఇళ్లు, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంటు, ఇనుము లభ్యత తదితర అంశాల్ని అధికారులు, ఎమినిటీ కార్యదర్శుల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కాంట్రాక్టర్లు పనులు చేయాలని, నోడల్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలని ఆమె చెప్పారు. పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని, సమస్యల్ని సమన్వయంతో పరిష్కరించుకోవాలని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఈఈ కొండారెడ్డి, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి : యువకుడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదిత్యనగర్‌కు చెందిన ఓ బాలికను శివనాగరాజు కాలనీ 5వ లైనుకు చెందిన తండల చరణ్ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి వెంట తీసుకుని కొద్ది రోజుల కిందట రాజమండ్రి వెళ్లాడు. అక్కడ గుడిలో తాళికట్టి అనంతరం లాడ్జికి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. కుటుంబ సభ్యులు ఈనెల 24న బాలిక కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి బాలికను గుర్తించారు. బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చరణ్‌పై కేసు నమోదు చేశారు.

షాపు యజమానిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

షాపులో దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం తొమ్మిదో లైనుకు చెందిన కోట సత్యనారాయణ వస్త్రాల షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం ఓ వ్యక్తి వచ్చి కొన్ని దుస్తులు కొనుగోలు చేశాడు. అనంతరం బిల్లును ఫోన్‌పే చెల్లిస్తాననంటూ చెల్లించే యత్నం చేశాడు. సత్యనారాయణ సెల్‌ఫోన్ తీసుకుని వేరేవారితో బ్యాలెన్స్ గురించి కొంతసేపు మాట్లాడుతున్నట్లు నటించాడు. అనంతరం తన అకౌంట్‌లో బ్యాలెన్స్ లేదంటూ ఆయనకు సెల్‌ఫోన్ ఇచ్చి వెళ్లిపోయాడు. కొంతసేపటి తరువాత సెల్ పరిశీలించగా సత్యనారాయణ అకౌంట్‌లోని రూ. 98వేలు డ్రా చేసినట్లు ఉంది. దీంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



ప్రకృతి వ్యవసాయం కిట్లు అందజేస్తున్న రాజకుమారి

పెదకాకాని: ప్రకృతి వ్యవసాయంపై రైతులంతా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి సూచించారు. మండలంలోని నంబూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం డ్వాక్రా గ్రూపుల్లోని మహిళా రైతులు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ గుంటూరు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ రైతులు ప్రధాన పంట వేసే ముందు 30 రకాల విత్తనాలు పొలంలో చల్లడం ద్వారా పోషకాలు భూమికి అందడంతో పాటు భూసారం పెరుగుతుందని చెప్పారు. చిరు ధాన్యాలు, ఆహార ధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు, నూనె గింజలు, తీగజాతి, పూల విత్తనాలు కలిపి చల్లుకోవాలని సూచించారు. తరువాత 35 రోజుల నుంచి 45 రోజుల మధ్య భూమిలో కలిపి దున్నుకోవాలని చెప్పారు. పశువులకు మేతగా కూడా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 12 కిలోలు వాడాలని, కిట్ ధరను రూ. 1000గా ప్రభుత్వం ధర నిర్ణయించిందని వెల్లడించారు. అనంతరం రైతులకు ప్రీమాన్ డ్రైసోయింగ్ (ప్రధాన పంట వేసే ముందు చల్లుకునే విత్తనాలు) కిట్లు పంపిణీ చేశారు. చివరిగా ప్రకృతి వ్యవసాయం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ డివిజన్ మాస్టర్ ట్రైనర్ మల్లేశ్వరి, ప్రాజెక్ట్ రిసోర్స్‌పర్సన్ జి నాగరాజా, పలువురు రైతులు పాల్గొన్నారు.


ఇంటింటికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం



వృద్ధురాలితో మాట్లాడి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. గుంటూరు రూరల్ మండలం 48వ డివిజన్ రెడ్డిపాలెం ఆశనిగుంటపాలెంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుచరిత గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్ని వివరించారు. ఏ గడపకు ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రత్యేక కరపత్రాల్ని అందజేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా.. ఇంకేమైనా సమస్యలున్నాయా? అని స్థానికుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్ని అమలు చేయకుండా చంద్రబాబు రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేశారని విమర్శించారు. కానీ మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు మాత్రమే కాకుండా తన దృష్టికి వచ్చిన అనేక సమస్యల్ని ఆయన పరిష్కరిస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు సంతృప్తి స్థాయిలో అందడం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని, ప్రస్తుతం మన ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలు ఒక్కసారి బేరీజు వేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పాలన సాగిస్తోందని ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం



తెనాలి: పట్టణంలోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ బుధవారం జరిగింది. 1వ వార్డు కౌన్సిలరు గెడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో 11 మంది విద్యార్థులను నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి, సత్కరించారు. పదో తరగతిలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులు కళాశాల విద్యలోనూ క్రమశిక్షణతో వ్యవహరించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సురేంద్ర సూచించారు. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులను ఎప్పటికీ విస్మరించరాదని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తగిన శ్రద్ధ తీసుకున్న తల్లిదండ్రులు, కష్టపడి చదివిన విద్యార్థుల సమష్టి కృషి వల్లే ఉత్తమ ఫలితాలను సాధించినట్లు తెలిపారు. 558, 555 మార్కులు సాధించిన బి.పుష్పాంజలి, ఎం.అక్షయ మాట్లాడుతూ విద్యను బోధించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషిని కొనియాడారు. పీఎంసీ చైర్మన్ రాజు, ప్రధానోపాధ్యాయుడు పి.రాజకిశోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మోక్షయింటే అయిన గుంటూరుసిటీ, శ్రీనగర్ 7/4 లైను, డోర్.నెం.7-16-262/52 కాపురస్తులు గండికోట కోటయ్యగారి కుమారుడు నాగరాజుగారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు ఆస్తి సికింద్రాబాద్ సిటీ, ఎ.యస్.రావు నగర్, డోర్.నెం.యల్.ఐ.జి-బి475 కాపురస్తులు కొత్త హనుమంతరావుగారు ది.07-11-2001న విక్రయ ద.నెం.9007/2001గా యస్.ఆర్.ఓ.గుంటూరులో రిజిష్టరు పొందినరీత్యా సంక్రమించిన ఆస్తిని [illegible] ... 7రోజుల లోగా దిగువ చిరునామాకి గానీ, మోక్షయింటుకు గానీ వ్రాతపూర్వకమైన ఆధారాలతో రిజిష్టరు పోస్టుద్వారా తెలియజేయ గలరు. [illegible]

షెడ్యూలు: గుంటూరు డి॥ & సబ్.డి॥, జి.యం.సి. ఏరియాలో చేరి [illegible] గుంటూరు సుద్దపల్లి డొంకకు దక్షిణపు దరి ఏరియా సందలి గుంటూరు గ్రామ శాలాకు డి.నెం.997లో ప్లాట్ నెంబర్లు 7/బి.8/బి ఛ.గ.425లలలో తూర్పు-ఉత్తరం ఈశాన్యదరి చ.గ.130లు భాగ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు: డొంక హద్దు, అ.30లు, దక్షిణం: నాశాలాకు నిల్వ స్థలం హద్దు, అ.39లు, పడమర: నాశాలాకు నిల్వ స్థలం హద్దు, అ.30లు, ఉత్తరం: ఇతరుల కాలాకు ఆస్తి హద్దు, అ.39లు.

టి. వాసుదేవ, యం. శ్రీనివాసరెడ్డి, అడ్వకేట్స్, డోర్.నెం.20-18-8/1,యం.జి.నగర్ 4వ లైను, పిటుకూరు రోడ్డు, గుంటూరు -522003.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com